# బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మహిళా సంక్షేమం


ఉత్తమ మహిళా అవార్డు గ్రహీత పరమేశ్వరీ సింగ్‌ను సత్కరించిన దృశ్యం

అబిడ్స్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మహిళా సంక్షేమం, మహిళా అభివృద్ధి, మహిళా వికాసం కొనసాగిందని మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్ పేర్కొన్నారు. కార్పొరేటర్‌గా, సమాజ నాయకురాలిగా ప్రజలకు విశేష సేవలందించిన ఆమెకు 2024 ఉత్తమ మహిళా నాయకురాలిగా అవార్డు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా పరమేశ్వరీసింగ్ మాట్లాడుతూ..ధూల్‌పేట్‌తో పాటు గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించేందుకు, ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారు లబ్ధిపొందే విధంగా తనవంతు కృషి చేస్తానని పరమేశ్వరీ సింగ్ పేర్కొన్నారు.

# ‘గత ప్రభుత్వం మూడు డీఏలను విస్మరించింది’


మాట్లాడుతున్న సర్దార్ మన్‌జిత్ సింగ్

నాంపల్లి: ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీనే జీతాలు ఇచ్చినందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ డ్రైవర్ల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ మన్‌జిత్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. చింతలబస్తీలోని డ్రైవర్ల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఉద్యోగులకు 1వ తేదీనే జీతాలు ఇస్తే మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు దక్కాల్సిన మూడు డీఏలను విస్మరించిందన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ డ్రైవర్లు, నాల్గవ తరగతి ఉద్యోగుల పట్ల తండ్రి పాత్ర పోషిస్తున్నారని అన్నారు. తెలంగాణ డ్రైవర్ల సమస్యలన్నీ పరిష్కరిస్తారనే నమ్మకం విశ్వాసం తమకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సహాధ్యక్షులు పంతులు శ్రీనివాస్, కోశాధికారి సయ్యద్ హసం హుస్సేన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈరవేణి పద్మారావు, ఎం.రాంచంద్రం, రాష్ట్ర కార్యదర్శి అలీం ఖాన్, సంయుక్త కార్యదర్శులు నర్సింగరావు, ఎల్.సుదర్శన్ పాల్గొన్నారు.

# గ్లకోమా వారోత్సవాలు

గోల్కొండ: గ్లకోమాపై అవగాహన కల్పించేందుకు దశాబ్ద కాలంగా తాము గ్లకోమా వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మెహిదీపట్నంలోని సరోజిని దేవీ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.రాజలింగం అన్నారు. ఆదివారం ఆసుపత్రిలో గ్లకోమా వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్లకోమా అనేది నిశబ్ద వ్యాధి అని ఇది సోకిన వారికి తమకు గ్లకోమా వచ్చింది అన్న విషయమే తెలియదన్నారు. దీనికి చికిత్స చేయవచ్చు గానీ దీనిని నయం చేయలేమని ఆయన అన్నారు. ముందస్తు రోగ నిర్ధారణ మాత్రం చేసుకుంటేనే ప్రయోజనం ఉంటుందని ఆయన అన్నారు. ఈ వ్యాధి ముదిరే వరకు గ్లకోమా బారినపడ్డ వారు కంటి ఆసుపత్రికి రారని ఆయన అన్నారు. గ్లకోమా వారోత్సవాలు మొత్తం వారం రోజుల పాటు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా సెమినార్స్, ర్యాలీలు, పోస్టర్, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. అనంతరం ఆయన ఆసుపత్రి వైద్యులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ నజాఫీ, ఆసుపత్రి వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.



గ్లకోమా వాక్‌లో డాక్టర్ రాజలింగం

# రంజాన్‌కు మక్కా మసీదు ముస్తాబు

- ఈనెల 12 నుంచి రంజాన్ మాసం ప్రారంభం
- చార్మినార్‌లో అప్పుడే మొదలైన రంజాన్ సందడి


మక్కా మసీదు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన షెడ్డు


వజూ కోసం ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన నీటి కొలను

చార్మినార్: రంజాన్ ఉపవాస దీక్షలకు మక్కా మసీదు సిద్ధమయ్యింది. ఈ నెల 12వ తేదీ నుంచి రంజాన్ మాసం ప్రారంభమౌతుండడంతో మక్కా మసీదులో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సామూహిక ప్రార్థనలకు హాజరయ్యే ముస్లింలు ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు మక్కా మసీదు ప్రాంగణంలో షామియానాలు, జానీమాజ్‌లు ఏర్పాటు చేశారు. వజూ చేయడం కోసం కొలను పరిశుభ్రం చేయడంతో పాటు రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. దాదాపు 20 వేల మంది ఒకేసారి సామూహిక ప్రార్థనలు చేసుకునే విధంగా నిర్మించిన మక్కా మసీదు దేశంలో గల అతి పెద్ద పురాతన మసీదులలో ఒకటి. ఎంతో పవిత్రమైన మక్కా మసీదులో రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలను ఇక్కడే విరమించడానికి ముస్లింలు ఎంతో ఆసక్తి చూపిస్తుండడంతో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపవాస దీక్షల సందర్భంగా ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేసి కర్జూరాలను సైతం అందజేయనున్నారు. ఆదివారం సాయంత్రం నుంచే చార్మినార్ పరిసరాల్లో రంజాన్ సందడి నెలకొంది.

## చార్మినార్ కట్టడానికి అతి సమీపంలో..

చార్మినార్ కట్టడానికి అతి సమీపంలో దక్షిణం వైపున సుమారు 100 గజాల దూరంలో మక్కా మసీదు ఉంది. మహ్మద్ ప్రవక్త మక్కాలో నిర్మించిన మసీదు నుంచి కొన్ని రాళ్లు తీసుకొచ్చి ఇక్కడి మసీదు నిర్మాణ సమయంలో ఉపయోగించారని..అందుకే ఈ మసీదుకు మక్కా మసీదని పేరొచ్చిందని చరిత్రకారులు చెబుతున్నారు. సాధారణ రోజుల కంటే రంజాన్ మాసంలో మక్కా మసీదుకు జనం రద్దీ ఎక్కువగా ఉంటుంది. సామూహిక ప్రార్థనలు, ఇఫ్తార్ విందులు, తరావీలు.. ఇలా ప్రతిరోజూ 24/7 మక్కా మసీదులో సందడి నెలకొంటుంది. అందుకే అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు.

# గోషామహల్ అభివృద్ధికి ప్రత్యేక కృషి


అనిల్‌కుమార్ యాదవ్‌ను సత్కరించిన బజ్జు బహిల్వాన్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బజ్జు పహిల్వాన్ అనిల్‌కుమార్ యాదవ్‌ను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గంతో తనకు ఎంతో అవినవభావ సంబంధం ఉందన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గం ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తెస్తే పరిష్కరించేందుకు ముందుంటానన్నారు. బజ్జు పహిల్వాన్ మాట్లాడుతూ..ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అండదండాలతో నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

## ప్రత్యేక పూజలు


పూజల్లో గాజుల అంజయ్య, మధుసూదన్ యాదవ్

చార్మినార్: ఫలక్‌నుమాలోని కాళికాదేవీ ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి ఎక్కువైంది. మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, హరిబౌలి బంగారు మైసమ్మ ఆలయ కమిటీ సలహాదారులు మధుసూదన్ యాదవ్, మాజీ అధ్యక్షులు అనంతోజ్ హన్స్‌రాజ్ తదితరులు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక

సుల్తాన్‌బజార్: ముదిరాజ్ ఎంప్లాయీస్ యాక్ట్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సమావేశం ఆదివారం హనుమాన్ టేక్డీలోని బీసీ సాధికారత భవన్‌లో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో భాగంగా రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా పులిదేవేందర్ ముదిరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సంజీవన్ కుమార్, గౌరవ అధ్యక్షులుగా బోయిని జగన్మోహన్ ముదిరాజ్, కార్యదర్శిగా పోలా కర్ణాకర్‌తో పాటు 50 మందిని రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దాసరి వీరన్న నర్సిములు, వెంకటయ్య, విజయ్‌కుమార్, రామాంజనేయులు, జ్యోతి, స్వప్న, శ్రీలత పాల్గొన్నారు.

## రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

నాంపల్లి: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన హైదరాబాద్ ఆర్పీఎస్ పోలీసు స్టేషన్ పరిధిలోని హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..ఓ గుర్తు తెలియని వ్యక్తి(38) హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్ వద్ద రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన పూర్ణ ప్యాసింజర్ ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై తెలుపు రంగు చొక్కా, బూడిద రంగు ప్యాంటు ఉనట్లు పోలీసులు తెలిపారు. సంబంధీకులెవరైనా ఉంటే హైదరాబాద్ జీఆర్పీ పోలీసులను లేదా 90003 94635లో సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉరివేసుకొని గృహిణి ఆత్మహత్య

చాంద్రాయణగుట్ట: అనారోగ్యంతో బాధ పడుతున్న ఓ గృహిణి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..నవాబు సాహెబ్ కుంట అబ్దుల్ హక్ భార్య సమీనా సుల్తానా(28) కొన్ని రోజులుగా బ్లడ్ ఇన్ఫెక్షన్‌తో బాధ పడుతుంది. మొఘల్‌పురాలోని అల్పా ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. పరిస్థితి సాధారణంగానే ఉన్నప్పటికీ నిరాశ నిస్పృహలకు గురయ్యిందని వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈ క్రమంలోనే ఈనెల 9న ఆమెను మరోసారి ఆసుపత్రిలో చికిత్స చేయించి, భర్త ఆటోలో ఇంటికి ఒంటరిగా పంపించాడు. కిషన్‌బాగ్‌లోని అత్తగారింటికి వెళ్లి ఉంటుందని భావించిన హక్ అక్కడికి వెళ్లి చూడగా ఆమె లేదని తెలిసింది. వెంటనే అత్తగారితో కలిసి తన ఇంటికి ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకు వచ్చి చూడగా సమీనా ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకొని కనిపించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి..

నాంపల్లి: జీవితంపై విరక్తి చెందిన ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన హైదరాబాద్ జీఆర్పీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఓ గుర్తు తెలియని వ్యక్తి(40) చందానగర్-హఫీజ్‌పేట రైల్వే స్టేషన్ల మధ్యలో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఒంటిపై గులాబి రంగు చొక్కా, పసుపు రంగు ప్యాంటు ధరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


పరీక్షలు చేస్తున్న కామినేని వైద్యులు

సుల్తాన్‌బజార్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కింగ్‌కోఠిలోని కామినేని ఆసుపత్రిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని కామినేని ఆసుపత్రి చైర్మన్ సూర్యనారాయణ కామినేని ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు ఉచిత స్కానింగ్‌లు, రక్తపరీక్షలు, థైరాయిడ్ ఫంక్షన్, గైనకాలజీ కన్సల్టేషన్‌తో పాటు వివిధ చికిత్సలు, పరీక్షలు నిర్వహించారు. అనంతరం సూర్యనారాయణ కామినేని మాట్లాడుతూ..మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు 8 నుంచి 15వ తేదీ వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 78159 78159 లో సంప్రదించాలని కోరారు.

## అన్నదానం


అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సంఘం ప్రతినిధులు

అనంతరం ఛత్రినాక పాత పోలీస్‌స్టేషన్ వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శ్రీరాం కోటయ్య గుప్తా, సలహాదారులు చీల రాములు గుప్తా, అధ్యక్షులు శ్రీధర మల్లికార్జున్ గుప్తా, ప్రధాన కార్యదర్శి, అధ్యక్షులు సరాబు సంతోష్ గుప్తా, కోశాధికారి కొల్కూరి నర్సింహులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇరుకుల్ల భిక్షపతి, సభ్యులు గుబ్బ శ్రీనివాస్, శిరంగి సంతోష్, విశ్వనాథం పాల్గొన్నారు.

గౌలిపురా: అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని గౌలిపురా బతుకమ్మ బావి వద్ద ఉన్న లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం లాల్‌దర్వాజా గౌలిపురా ఆధ్వర్యంలో పరమశివునికి విశేష పూజలు, రుద్రాభిషేకం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

# వెంకటేశ్వర్‌రావు గురుస్వామికి నివాళి



విజయనగర్‌కాలనీ: తిరుపతి వెంకటేశ్వర స్వామి సేవకు వెళ్లిన ఓ గురుస్వామి ఇటీవల అక్కడే హార్ట్‌ఎటాక్‌తో తుదిశ్వాస విడిచారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన వెంకటేశ్వర్‌రావు గురుస్వామి 30 ఏళ్ల నుంచి అయ్యప్ప మాలధారణ చేస్తూ వేలాది అయ్యప్పస్వాములకు మాలధారణ చేశారు. గత నెలలో శ్రీవారి సేవకు ఆసిఫ్‌నగర్ భక్తబృందంతో వెళ్లిన ఆయన అనూహ్యంగా గుండెపోటుతో తిరుమలలో మృతి చెందారు. ఆయనను స్మరించుకుంటూ ఆదివారం ఆసిఫ్‌నగర్ రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురుస్వాములు రాంబాబు, లక్ష్మీనారాయణ, నాగ తిరుపాల్, కొన్నె సతీష్ గౌడ్, జి.రాంచందర్, కృష్ణ గౌడ్, కేశవ పంతులు, జి.నాగేష్, మల్లేపూల విద్యాసాగర్ పాల్గొన్నారు.

# ఎరుకల కులస్తులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం


మధుయాష్కీగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర ఎరుకల సంఘం నాయకులు

గోల్కొండ: తెలంగాణలోని ఎరుక కులస్తుల న్యాయసమ్మతమైన కోరికలను తమ ప్రభుత్వం పరిష్కరిస్తుందని కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. తమ సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆదివారం రాష్ట్ర ఎరుకల సంఘం వారు ఆయనకు అందించారు. రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో ఏకలవ్య సంక్షేమ భవనాల కోసం స్థలం కేటాయించి భవనాలు నిర్మించి ఇవ్వాలని ఏకలవ్యుడి విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ పరంగా తమకు ఇప్పటి వరకు రాజకీయ ప్రాతినిధ్యం లభించలేదని రాష్ట్రంలో ఏడు లక్షల మంది ఎరుక సోదరులు మైదాన ప్రాంతాల్లో నివసిస్తున్నారని తమకు ఒక ఎమ్మెల్సీ సీటును కేటాయించాలని వినతిపత్రంలో కోరారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లను విడదీసి ప్రత్యేకంగా ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. కాగా ఈ విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఎరుకల సోదరులకు న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కురాకుల కృష్ణ, సంఘం నాయకులు తదితరులున్నారు.

# డ్రైనేజీ పూడికతీత పనుల పరిశీలన

గోల్కొండ: అన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ పూడికతీత పనులు నిర్వహిస్తున్నామని జలమండలి గోల్కొండ ఏరియా మేనేజర్ సయ్యద్ సాజిద్ అన్నారు. ఆదివారం గోల్కొండ రేతిగల్లీ, మహ్మదీయ మసీద్, బల్దియా పార్కు తదితర ప్రాంతాల్లో జరుగుతున్న డ్రైనేజీ పూడికతీత పనులను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీలపై వస్తున్న సమస్యలను వెంటనే స్పందించి పరిష్కరిస్తున్నామని ఆయన అన్నారు. మజ్లిస్ నాయకులు బాబర్ అలీఖాన్, అజీజ్‌ఖాన్ పటాన్ తదితరులున్నారు.

## ‘కోట’ కిటకిట

గోల్కొండ: గోల్కొండ కోట జాతరను తలపించింది. ఆదివారం వేల సంఖ్యలో పర్యాటక ప్రాంతమైన గోల్కొండ కోటకు భారీ ఎత్తున పర్యాటకులు తరలివచ్చారు. ఇంత పెద్ద సంఖ్యలో పర్యాటకులు రావడంతో బుక్కింగ్ కౌంటర్ ముందు వేల సంఖ్యలో పర్యాటకులు టికెట్ల కోసం బారులుతీరారు. మరోవైపు భారీ సంఖ్యలో పర్యాటకులు రావడంతో కోటలోని మెయిన్ గేట్‌తో పాటు సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. గోల్కొండ కోటలోని పలు ప్రాంతాల్లో పర్యాటకులు సందడి చేశారు.



## గుడిమల్కాపూర్‌లో ‘ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన’


పేర్లు నమోదు చేసుకుంటున్న మహిళలు


గోల్కొండ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రారంభించిన ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన కార్యక్రమం విశ్వకర్మ కులస్తులకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతుందని కార్వాన్ సగర సంఘం ఉపాధ్యక్షుడు కొండల్‌ముకేష్‌సాగర్ అన్నారు. ఈ కార్యక్రమానికి కార్వాన్ పరిసర ప్రాంతాల నుంచి విశ్వకర్మ కులస్తులు సుమారు 150 మంది దరఖాస్తులు చేసుకున్నారు. కార్యక్రమంలో సగర సంఘం ప్రధాన కార్యదర్శి అంబటి అనిల్‌సాగర్, బి.ప్రభాకర్‌సాగర్, సి.వినోద్‌సాగర్, రక్షిత్‌సాగర్, జొన్నకుంటి మధుసుధన్ తదితరులున్నారు.

## 16 నుంచి ప్రతి శనివారం హనుమాన్ చాలీసా పఠనం


కాశీబుగ్గ బాబన్న


జియాగూడ: ఈనెల 16వ తేదీ నుంచి ప్రతి శనివారం సనాతన హిందూ ఆలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పఠనాన్ని చేపడుతున్నట్లు సనాతన హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర చైర్మన్ పుట్టి యాదగిరి ముదిరాజ్, అధ్యక్షుడు టి.యమన్‌సింగ్, కోశాధికారి సీహెచ్.కాశిబుగ్గ బాబన్న, కార్వాన్ నియోజకవర్గం అధ్యక్షుడు చిలుకల చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం జియాగూడలోని 2బీ హెచ్‌కే కాలనీ, డిగ్నిటి హౌసింగ్ సొసైటీలో గల సనాతన హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి శనివారం సాయంత్రం కార్యాలయం ఆవరణలో సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ఉచితంగా హనుమాన్ ఛాలీసా, శ్రీరాముడి శ్లోకాలు, పద్యాలు, పాటలు నేర్పించడానికి పురానాపూల్ అఖాడా బడా ఉదాసీన్ పంచాయితీ గురు మహారాజ్ పఠనం, ప్రవచనాలు ఉపదేశిస్తారన్నారు.

## ‘బీజేపీ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి’


గౌరీ సతీష్

అబిడ్స్: బీజేపీ దిగజారుడు రాజకీయాలను మానుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న బండి సంజయ్ నోరును అదుపులో పెట్టుకుని మాట్లాడాలన్నారు. ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దని బండి సంజయ్ పేర్కొనడం దిగజారుడు రాజకీయమన్నారు. ఆదివారం తన కార్యాలయంలో గౌరీ సతీష్ విలేకర్లతో మాట్లాడుతూ..పదేళ్లక్రితం ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన వాగ్దానాలు ఏమాత్రం నెరవేర్చలేదన్నారు. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని దేశానికి తెప్పించి రూ.15 లక్షలు ప్రతి ఒక్కరి అకౌంట్లో వేస్తానన్న నరేంద్రమోదీ ఎందుకు వేయలేదన్నారు. గత పదేళ్లల్లో పేదరికం దేశంలో పెరిగిపోయి ప్రజలు అన్ని విధాల అవస్థలకు గురయ్యారని ఆయన అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేస్తే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు.

## అన్నదానం ఎంతో గొప్పది



సుల్తాన్‌బజార్: అన్ని దానాలకెల్లా అన్నదానం ఎంతో గొప్పదని బజరంగ్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్ లక్ష్మణ్‌రావు అన్నారు. కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బజరంగ్‌సేనా ఆధ్యాత్మిక కార్యక్రమలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే భక్తులకు అన్నదాన ప్రసాద కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఎర్రం శ్రీనివాసరావు, సునీల్ అగర్వాల్, మనోజ్, అభినవ్ తివారి, అస్మిత్, నరేష్, ఆనంద్ మిశ్రా, రామేశ్వర్, వీరేందర్, రాజారాం, విజయ్ పాల్గొన్నారు.